



మనోహరాబాద్– కొత్తపల్లి నూతన రైలు మార్గంలో గిరిపల్లి వరకు నిర్మాణం పూర్తి కావచ్చిన రైల్వేట్రాక్
★ గజ్వేల్ పట్టణ శివారులో రింగ్‌రోడ్డును దాటేందుకు నిర్మిస్తున్న రైల్వే వంతెన

# గజ్వేల్‌కు త్వరలో చుక్..చుక్..!

- **తుది దశలో మనోహరాబాద్ - గజ్వేల్ రైలు మార్గం**
- **చురుగ్గా సాగుతున్న పట్టాల పనులు**

ఈనాడు, హైదరాబాద్: మనోహరాబాద్- కొత్తపల్లి నూతన రైలు మార్గం నిర్మాణంలో మొదటిదశ పనులు కీలకదశకు చేరుకున్నాయి. మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు 32 కిమీ మార్గం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో గిరిపల్లి వరకు 25 కిలోమీటర్ల దూరం పట్టాలు పరిచే పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మిగిలిన ఏడు కిలోమీటర్ల దూరంతోపాటు గజ్వేల్ వలయ రహదారి వద్ద పైవంతెన నిర్మాణపనులు జరుగుతున్నాయి. వీటిని మార్చికల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా చూస్తే నాలుగైదు నెలల్లో గజ్వేల్‌కు రైలు కూత వినిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉత్తర తెలంగాణలో ప్రధాన పట్టణమైన కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు రావడానికి రోడ్డుమార్గమే ఆధారం. 2006లో కొత్తపల్లి(కరీంనగర్)- మనోహరాబాద్ నూతన రైలు మార్గం మంజూరైంది. కానీ ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టడంతో 2016 ఆగస్టు 7న ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భంగా కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం లభించడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.125 కోట్ల కేటాయించగా దాదాపు రూ.112 కోట్లు ఖర్చుచేసినట్లు రైల్వేశాఖ గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం 151.36 కిమీ మార్గాన్ని మనోహరాబాద్-గజ్వేల్, గజ్వేల్-దుద్దెడ, దుద్దెడ-సిరిసిల్ల, సిరిసిల్ల-కొత్తపల్లి నాలుగు దశలుగా విభజించారు. ఈ మార్గంలో 13 కొత్త రైల్వేస్టేషన్లు రానున్నాయి. వీటిలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ ముఖ్యమైనవి.

## వంతెన పనులే కీలకం

మేడ్చల్ దాటాక వచ్చే మనోహరాబాద్ నుంచి ఈ లైను ప్రారంభం అవుతుంది. ఇందులో 25వ కి.మీ. గిరిపల్లి వరకు దాదాపుగా పట్టాలు పరిచి రైల్వేట్రాక్‌ను సిద్ధం చేశారు. గిరిపల్లి నుంచి గజ్వేల్ వరకు మట్టిపనులు పూర్తయ్యాయి. చిన్నచిన్న వంతెన పనులతోపాటు ట్రాక్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గజ్వేల్ పట్టణ శివారులో రింగు రోడ్డును దాటుతూ రైల్వేమార్గం వెళ్లాలి. దీనికోసం ఇక్కడ ఆర్వోబీ (పైవంతెన) నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణం పూర్తికావచ్చింది. మనోహరాబాద్ దాటిన తర్వాత నాగ్‌పూర్ జాతీయరహదారిని ఈ రైల్వేలైన్ దాటేందుకు చేపడుతున్న ఆర్వోబీ పనులు కూడా పూర్తికావల్సి ఉంది. ఈ రెండు వంతెనలు పూర్తయితే మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు రైలుమార్గం అందుబాటులోకి వచ్చినట్లే అని రైల్వే అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత ట్రయల్ రన్ పరీక్షలు చేపడతారని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. మార్చి నాటికి ట్రయల్ రన్ ప్రారంభం అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. భద్రత పరీక్షలు పూర్తిచేసుకుని కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) ఆమోదం పొందాల్సి ఉంది. ఆ తర్వాత ప్రయాణికుల రైళ్లను పట్టాలు ఎక్కిస్తారు. మొత్తంగా నాలుగైదు నెలల్లో ఈ మార్గం అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం కావడంతో రైల్వేశాఖ కూడా మొదటిదశపై శ్రద్ధ పెడుతోంది. ప్రస్తుతం కాచిగూడ, సికింద్రాబాద్‌ల నుంచి మనోహరాబాద్ వరకు డెమూ రైళ్లు నడుస్తున్నాయి. మనోహరాబాద్-గజ్వేల్ మార్గం పూర్తయ్యాక డెమూ రైళ్లను గజ్వేల్ వరకు పొడిగించే అవకాశం ఉంది. ఆ తర్వాత ఏడాదిలో సిద్దిపేట వరకు, 2021-22 మార్చి నాటికి కొత్తపల్లి వరకు పూర్తిచేసి మొత్తం మార్గాన్ని పూర్తి చేయాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

### ప్రాజెక్టు వివరాలు

- మనోహరాబాద్–కొత్తపల్లి 151.36 కిమీ
- అంచనావ్యయం రూ.1160.4 కోట్లు
- ఉచితంగా భూమితోపాటు మూడోవంతు వ్యయం భరించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- తొలి ఐదేళ్ల నష్టాలు భరించనున్న రాష్ట్ర సర్కారు